యదుకుల కాంభోజి - ఆది

కొలని దోపరికి - గొబ్బిళ్ళో యదు
కుల స్వామికిని - గొబ్బిళ్ళో

కొండగొడుగుగా - గోవులగాచిన
కొండొక శిశువుకు - గొబ్బిళ్ళో
దుండ గంపు దై - త్యులకెల్లను తల
గుండు గండనికి - గొబ్బిళ్ళో

పాపవిధుల శిశు - పాలునితిట్టుల
కోపగానికిని - గొబ్బిళ్ళో
ఏపున కంసుని - ఇడుమల బెట్టిన
గోపబాలునకు - గొబ్బిళ్ళో

దండివైరులను - దరిమిన దనుజుల
గుండె దిగులునకు - గొబ్బిళ్ళో
వెండి పైడియగు - వేంకటగిరిపై
కొండలయ్యకును - గొబ్బిళ్ళో

అన్నిప్రక్రియలూ అన్నమాచార్యులు తమ పదాలకెక్కించి, వాటిని వైకుంఠ మెక్కించారు. దంపుళ్ళ పాటలు, జాజరలు, జోలలు, ఉయ్యాల పాటలు - ఒకటేమిటి అన్ని ఆయన పదాల నలంకరించాయి. ఇది గొబ్బిళ్ళ పాట.

ప్రతి పనీ పరమేశ్వరార్పణగా, నాచరించే హరిభక్తి సంప్రదాయం ఈ కీర్తనలో యింపారుతున్నది. సంక్రాంతి పండుగ ముందరి రోజుల్లో కన్నె పడుచులు గోమయంతో గొ బ్బెళ్ళు చేసి తీర్చిన రంగవల్లులలో ఉంచి గోమయగోళాలలను అలంకరించి, వాటిచుట్టు నృత్యశైలిగా చక్రవలయంలో తిరిగే ఆట గొబ్బెళ్ళ ఆట. పాడే పాట గొబ్బిళ్ళపాట. యదుకుల స్వామికి కైంకర్యమైన పాట. భక్తులకు వెండి బంగారాలైన శ్రీవేంకటాద్రిపైన కొలువై యున్న కొండలయ్యకు సమర్పితంగా ఈ గొబ్బిళ్ళ పాట మధురమనోజ్ఞంగా అన్నమయ్య నోట నలరినది.